సాక్షి మహబూబాబాద్

శుక్రవారం | 13 | జూన్ | 2025



ట్రెయినీ కలెక్టర్ల సందర్శన

కాళేశ్వరం ప్రాజెక్టును ట్రెయినీ కలెక్టర్లు సౌరభ్ శర్మ, సలోని చోబ్రా, హర్షచౌదరి, కెరోలిన్ చింగ్తియానమావి, కొయ్యాడ ప్రణయ్ కుమార్ బృందం సందర్శించింది. - 8లో ▸



రెండు గంటలు..30 మంది అధికారులు

సౌత్ వెస్ట్రన్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన దాదాపు 30 మంది బృందం సభ్యులు కాజీపేట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. - 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0^{0} / 25.7^{0}

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బడి తెరవాలని పూర్వ విద్యార్థుల నిరసన



మహబూబాబాద్ అర్బన్: తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాలను వెంటనే పునఃప్రారంభించాలని కుమ్మరికుంట్ల తండా పాఠశాల పూర్వ విద్యార్థులు బానోతు శ్రీను, బానోతు రఘు డిమాండ్ చేశారు. మానుకోట మున్సిపల్ పరిధి 10వ వార్డు కుమ్మరికుంట్ల తండా ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల ముందు పూర్వ విద్యార్థులు గురువారం నిరసన చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. కుమ్మరికుంట్ల తండా పాఠశాలలో 2018 వరకు సుమారు 60 మంది విద్యార్థులు చదువుకున్నారని, కరోనా సమయంలో విద్యార్థులు రాక మూసివేశారన్నారు. ఇప్పటికైనా ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలను తెరిచి, గిరిజన విద్యార్థుల చదువుకు తోడ్పడాలన్నారు. పూర్వ విద్యార్థులు బానోతు హరి, నరేశ్, నవీన్, దేవేందర్, సురేశ్, అశోక్, శివ, జోహన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ గురువారం తెలిపారు. మధ్యాహ్నం 3నుంచి 4 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని, ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రజలు, ప్రయాణికులు 85003 24880 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

మా వాటా మాకు దక్కాల్సిందే..



కురవి: రాజ్యాంగబద్ధంగా బీసీలకు దక్కాల్సిన సంగం వాటా దక్కాల్సిందేనని జన అధికార సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ పరికి పండ్ల అశోక్ అన్నారు. మధ్యప్రదేశ్ సీనియర్ ఐఏఎస్ అధికారి నరహరి రచించిన ఓబీసీ రైసింగ్ పుస్తకాన్ని కురవి వీరభద్రస్వామి ఆలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఓబీసీ పోరుబాట పుస్తకంలో పొందుపర్చడం జరిగిందన్నారు. ఓబీసీల పోరుబాట పుస్తకం తొమ్మిది విభాగాలుగా విభజించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి యాకమ్మ, గుర్రపు సత్యనారాయణ, బాణాల వీరయ్య, పింగిలి శ్రీనివాస్, కోట జనార్దన్, రేణిగుంట్ల శ్రీదేవి, మాచర్ల రమేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద అర్బన్: జిల్లా గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ వివిధ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన ఆర్సీఓ రత్నకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు మానుకోట జిల్లా కేంద్రంలోని ఇందిరా కాలనీ పాత కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ హాజరుకావాలన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం..



మహబూబాబాద్ రూరల్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో జిల్లా న్యాయస్థాన ప్రాంగణం నుంచి తొర్రూరు బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం మీదుగా తిరిగి మళ్లీ కోర్టు వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. న్యాయ చైతన్య సదస్సుల ద్వారా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి మనవంతు కృషి చేయాలని సూచించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరినీ తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి, జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ప్రేమ్ చంద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల బడిబాట..

పూలతో స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

- మొదటి రోజు పాఠశాలలకు వెళ్లేందుకు ఆసక్తిచూపని స్టూడెంట్స్

మహబూబాబాద్ అర్బన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. చిన్నారులు ఆటపాటలకు గుడ్‌బై చెప్పి పాఠశాలలకు తొలిరోజు వెళ్లారు. 45 రోజుల పాటు వేసవి సెలవులను ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపిన విద్యార్థులు బడిబాటపట్టారు. ఇన్ని రోజులు బోసిపోయిన పాఠశాలలు విద్యార్థుల రాకతో కళకళలాడాయి. ఉదయాన్నే తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలను పాఠశాలల వద్ద దింపారు. కొందరు చిన్నారులు నవ్వుతూ వెళ్లగా.. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు ఏడుస్తూ మారం చేస్తూ కనిపించారు. కాగా బుక్‌స్టాళ్లు, షూమార్ట్‌లు, బట్టల షాపులు విద్యార్థులతో కిక్కిరిశాయి.

హాజరు అంతంతే..

తొలిరోజు తక్కువ సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా సమయానికి హాజరుకాలేదు. పాఠాలు బోధించలేదు. వచ్చిన విద్యార్థులు స్కూల్ ఆవరణలో ఆడుతూ, పాడుతూ కనిపించారు. సర్కారు పాఠశాలకు భిన్నంగా ప్రైవేట్ స్కూళ్లు విద్యార్థులతో కళకళలాడాయి. అధికశాతం విద్యార్థులు హాజరయ్యారు.

సమస్యల స్వాగతం..

ప్రతి ఏటా మాదిరిగానే ఈ విద్యా సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు స్వాగతం పలికాయి. చాలాచోట్ల తాగునీరు, విద్యుత్ అంతరాయం, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో సమస్యలు దర్శనమిచ్చాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. కొన్ని పాఠశాలల్లో కిటికీలు సరిగాలేక, ఫ్యాన్లు తిరగక విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. కాగా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. మరికొన్ని పాఠశాలల్లో యూనిఫాం అందజేశారు. జిల్లాలోని పలు తండాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేని పాఠశాలలు కొన్ని తెరుచుకోలేదని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. విద్యార్థులు ఎదురుచూసి తిరిగి ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని హనుమంతునిగడ్డ, గుమ్ముడూరు ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎంలు హల్యానాయక్, ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఎంఈఓ శీలం వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికారు.



హనుమంతునిగడ్డ పాఠశాలలో విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయ బృందం





పాఠశాలకు హాజరవుతున్న చిన్నారులు, పాఠశాలకు హాజరైన విద్యార్థులు

సమయానికి ఉపాధ్యాయులు హాజరుకావాలి



ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలి. అదేవిధంగా గైర్హాజరైన, పాఠశాలలు సమయానికి తీయని ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేవిధంగా నడుచుకోవాలి.

– రవీందర్‌రెడ్డి, డీఈఓ

పేద బిడ్డలకు నాణ్యమైన విద్య అందిస్తాం

- డీఈఓ రవీందర్‌రెడ్డి

తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పేద బిడ్డలకు నాణ్యమైన విద్య అందిస్తామని డీఈఓ రవీందర్ రెడ్డి అన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు పంపిణీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారన్నారు. ఎంఈఓ బుచ్చయ్య, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ పాఠశాలలుగా గుర్తింపు తెచ్చుకోవాలి

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలలుగా గుర్తింపు తెచ్చుకోవాలని డీఈఓ రవీందర్ రెడ్డి అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా గురువారం మహబూబాబాద్ మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు డప్పు చప్పుళ్లతో ఆహ్వానించారు. డీఈఓ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. హెచ్‌ఎంధారావత్ బద్రునాయక్,



తొర్రూరులో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, ఈదులపూసపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం పూజారి వీరయ్య, ఉపాధ్యాయులు పాలకుర్తి మౌనిక, మాడిశెట్టి సూర్యప్రకాశ్, గొట్టిముక్కల పవన్ రాజ్, బొమ్మెర కృష్ణమూర్తి, రాచకొండ ఉపేందర్ విద్యార్థులు ల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు డీఈఓ రవీందర్‌రెడ్డి గురువారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన పాఠశాలను సందర్శించారు. హెచ్‌ఎం మహమ్మద్ వహీద్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, రిటైర్డ్ టీచర్ వెంకట్రాం నర్సయ్య, ఉపాధ్యాయులు శ్రీధర్, విజయ్‌రాజ్, వెంకన్న, వెంకటేశ్వర్లు, నరసింహచారి, ప్రేమ్‌సాగర్, దేవి, యాకమ్మ, మల్లికార్జున్‌రావు, రాజు, రత్నమాల, పద్మలత పాల్గొన్నారు.

వెరిఫికేషన్ త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, వీరబ్రహ్మాచారితో కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ప్రతిపాదనల ప్రకారం నిధుల మంజూరు జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ, పట్టణ ప్రాంతాల్లో కమిటీ సభ్యులు లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ పురుషోత్తం, హౌసింగ్ డీఈ రాజయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ పూర్తి

1,76,101 మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు

- ధాన్యం మొత్తం మిల్లులకు తరలింపు
- రూ.408.47 కోట్లకు గానూ.. రూ.321.20కోట్లు చెల్లింపు

మహబూబాబాద్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశారు. ఈనెల 9వ తేదీ వరకు 1,76,101 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. అందుకు రూ.408.47 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.321.20 కోట్లు చెల్లించారు. ప్రతీసారి ఆన్‌లైన్‌లో జాప్యంతో చెల్లింపులు నెమ్మదించినట్లు అధికారులు తెలిపారు. కాగా ఈసారి వెనువెంటనే ధాన్యం మిల్లులకు తరలింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అకాల వర్షాల వల్ల పలు సమస్యలు తలెత్తినా.. వాటిని అధిగమించి కొనుగోళ్లను సజావుగా పూర్తి చేశారు.

1,36,236 ఎకరాల్లో వరి సాగు..

జిల్లాలో 18 మండలాలు ఉండగా గంగారంలో వరిపంట సాగు చేయలేదు. దీంతో 17 మండలాల్లో 1,36,236 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈమేరకు 1,79,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరుగుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే సన్నధాన్యం 1,40,130మెట్రిక్ టన్నులు ,గ్రేడ్ ఏ రకం 32,224 మెట్రిక్ టన్నుల ధాన్యం, కామన్ రకం 3,746 మెట్రిక్ టన్నుల ధాన్యం మొత్తంగా 1,76,101 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. 35,207 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ.408.47 కోట్లు అని అధికారులు తెలిపారు.



ఆన్‌లైన్‌లో జాప్యం..

32,216 మంది రైతులకు సంబంధించిన 1,48,412 మెట్రిక్‌టన్నుల ధాన్యం ఆన్‌లైన్ అయ్యింది. దాని విలువ 344.23 కోట్లు ఉందని అధికారులు పేర్కొన్నారు. కాగా 29,921మంది రైతులకు రూ.321.20 కోట్లు చెల్లింపులు చేశారు. ఇంకా 2,295 మంది రైతులకు సంబంధించి రూ.23.02 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే రూ.64 కోట్ల విలువైన ధాన్యం ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. కాగా ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేసినట్లు సివిల్ సప్లయీస్ అధికారులు తెలిపారు.

ప్రైవేట్‌కు పరుగు..

జీజీహెచ్‌లో అందని స్కానింగ్, ఎక్స్‌రే సేవలు

- అత్యవసర సమయంలో ప్రైవేట్ బాట పడుతున్న రోగులు
- ఖాళీగా టెక్నీషియన్ పోస్టులు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో డయోగ్నోస్టిక్స్ ల్యాబ్, రేడియాలజీహబ్‌ను ఏర్పాటు చేశారు. అయితే రోగులకు మాత్రం అక్కడ పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి సీటీ స్కానింగ్, ఎక్స్‌రే ఇతర పరికరాలను ఏర్పాటు చేశారు. కానీ, రేడియాలజీహబ్‌లో సరిపడా టెక్నీషియన్స్ లేకపోవడంతో సాయంత్రం తర్వాత స్కానింగ్, ఎక్స్‌రే సేవలు పూర్తిగా నిలిచిపోతున్నాయి.

వేధిస్తున్న కొరత..

టెక్నీషియన్లు, రేడియాలజిస్టుల కొరత కారణంగా పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. రేడియాలజి హబ్‌లో 9మంది టెక్నీషియన్లకు గానూ ఇద్దరు మాత్రమే ఉండడంతో సాయంత్రం 4 గంటల వరకే సేవలు అందిస్తున్నారు. సాయంత్రం, రాత్రి వేళ, అత్యవసర సమయాల్లో ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోందని రోగులు తెలుపుతున్నారు. ఆదివారం సేవలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. పెద్దాస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ పేదలకు అందాల్సిన వైద్య సేవల్లో నిర్లక్ష్యం జరుగుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా.. ఆదిశగా అడుగులు పడడం లేదు.



జీజీహెచ్‌లోని రేడియాలజి హబ్

కలెక్టర్‌కు నివేదించాం

ఆస్పత్రిలోని రేడియాలజీహబ్‌లో ఇద్దరు మాత్రమే టెక్నీషియన్లు ఉన్నారు. ఏడు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, కలెక్టర్ భర్తీ ప్రక్రియను పెండింగ్‌లో ఉంచారు. చాలా సార్లు కలెక్టర్‌కు నివేదించాం . 72 పోస్టుల్లో టెక్నీషియన్లు, మెకానిక్, డ్రైవర్లు, సిబ్బంది ఇతర పోస్టులు ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేస్తే పూర్తిస్థాయిలో సేవలు అందుతాయి. తక్కువ సిబ్బంది ఉన్నప్పటికీ ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలు అందిస్తున్నాం.

– శ్రీనివాసరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్

కమిషన్ ఎదుట అబద్ధాలు చెప్పిన కేసీఆర్

నెహ్రూసెంటర్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అబద్ధాలు చెప్పారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు నష్టం వాటిల్లేలా చేసిన బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని తానై కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినట్లు చెప్పుకున్న కేసీఆర్.. కూలిపోతుందని తెలియగానే అధికారులు, ఇంజనీర్లదే తప్పిదమంటూ చెబుతున్నారని మండిపడ్డారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఒక ఎకరాకు కూడా నీటిని అందించలేదని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్, నాటి మంత్రులు అబద్ధాలు చెప్పి తప్పించుకోలేరన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమాయక గిరిజనులను కాల్చి చంపేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోలు తమ పంథా మార్చుకుని తుపాకులను వదిలేసి ప్రజాస్వామ్య పద్ధతుల్లో కొట్లాడాలని హితవు పలికారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. విద్యాశాఖపై సమీక్షలు నిర్వహించాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలన్నారు. జూలై 5, 6 తేదీల్లో జరగనున్న సీపీఐ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. 5న బహిరంగ సభ ఉంటుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని సూచించారు. అనంతరం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు బి.అజయ్‌సారథిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పెరుగు కుమార్, నవీన్, వెంకన్న, వరిపెల్లి వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, నెల్లూరు నాగేశ్వర్‌రావు, కట్లోజు పాండురంగాచారి పాల్గొన్నారు.



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

10 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

కేసముద్రం: అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని తాపూర్యాతండా జీపీలో గురువారం జరిగింది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తాపూర్యాతండా జీపీ శివారు ముత్యాలమ్మ తండాకు చెందిన మాలోతు అశోక్, దుబ్బతండాకు చెందిన వాంకుడోతు గణేశ్ గ్రామ శివారులోని శ్మశాన వాటిక సమీపంలో 10క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను నిల్వ ఉంచారు. సమాచారం మేరకు బెల్లం, పటికను స్వాధీనం చేసుకుని వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యూరియా వాడకం తగ్గించాలి

నెల్లికుదురు: రైతులు పంటల సాగులో యూరియా, రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించాలని ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం వ్యవసాయశాఖ, మల్యాల కేవీకే ఆధ్వర్యంలో రైతుల ముంగిట శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరం మేరకే రసాయన ఎరువులు వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. భూసార పరీక్షలు ఆవశ్యకతపై కేవీకే శాస్త్రవేత్త కిశోర్ కుమార్ సూచించారు. వానాకాలం పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, సేంద్రియ వ్యవసాయంపై శాస్త్రవేత్త రాంబాబు, ఏఓ యాస్మిన్ తెలియజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎరువు షాపులను ఏడీఏ, ఏఓ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు చందన, ప్రతిభ, ప్రవీన్, రవి, రైతులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో నూతనంగా విధుల్లో చేరిన వార్డెన్లు అంకితభావంతో పని చేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి ఎం.నర్సింహస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల కార్యాలయంలో గురువారం నూతనంగా విధుల్లో చేరిన వార్డెన్లను తోటి వార్డెన్లు సన్మానించారు. ఏఎస్‌డబ్ల్యూఓ, శివభాస్కర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ పూర్ణ, వార్డెన్లు, మధు, వీరన్న, రజిని, శ్రీలత, రమేశ్, యాలాద్రి, శ్రీనివాస్, సుధాకర్, బాలరాజు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు: రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్న రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మచ్చర్లలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. దరఖాస్తులతో వస్తున్న రైతులతో మాట్లాడి, వారి సమస్యలను డీటీకి తెలిపారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా, న్యాయం చేయాలని ఆయన కోరారు. మచ్చర్లలో 75, నాయకపల్లి సదస్సులో 75 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగభవాని తెలిపారు.

వంట మనిషి ఇంట్లోనే బడి..

- 24 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే పాఠశాల

కేసముద్రం: ప్రాథమిక పాఠశాలకు సొంతభవనం లేక అద్దె భవనాల్లో నడిపిస్తూ వచ్చారు. చివరకు ఆ తండాలో అద్దెకు భవనం దొరకలేదు. దీంతో గత ఏడాది మధ్యాహ్న భోజనం వండి వడ్డించే వంటమనిషి ఇంట్లో బడిని నడిపించారు. అయితే స్కూల్ బిల్డింగ్ నిర్మాణం పూర్తికాకపోవడంతో ఈ విద్యా సంవత్సరం కూడా వంట మనిషి ఇంట్లోనే పాఠశాలను గురువారం పునఃప్రారంభించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కేసముద్రం మున్సిపాలిటీ పరిధి బ్రహ్మంగారితండాలో 2001లో ప్రాథమిక పాఠశాల ప్రారంభం కాగా, అప్పటి నుంచి సొంతభవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే బడిని నడిపిస్తూ వచ్చారు. మొదట్లో 60 మంది విద్యార్థులు ఉండగా, ఆ తర్వాత సంఖ్య తగ్గుతూ 18 మందికి చేరింది. మూడేళ్ల క్రితం మన ఊరు–మన బడి కింద స్కూల్ భవనం కోసం రూ.28 లక్షల నిధులు మంజూ చేయగా.. పిల్లర్ల వరకే నిర్మాణం చేపట్టారు. తర్వాత పనులు చేపట్టకపోవడంతో అద్దె భవనంలోనే బడిని నడిపిస్తూ వచ్చారు. ఈ మేరకు గత ఏడాది తండాలో అద్దెకు భవనం దొరకలేదు. దీంతో బడిలో మధ్యాహ్నం భోజనం వండే వంట మనిషి వినోద.. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తన ఇంట్లో బడిని నడిపించడానికి అంగీకరించింది. ఈఏడాది కూడా స్కూల్ బిల్డింగ్ అసంపూర్తిగా ఉండటంతో.. ఆమె ఇంట్లో రేకుల షెడ్డుకింద బడిని పునఃప్రారంభించారు. ఇటీవల బడిబాట కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతూ ఉపాధ్యాయులు ప్రచారం చేస్తుండగా, సొంత భవనంలేని బడికి ఎలా పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. కాగా, భవన నిర్మాణం పూర్తిచేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బ్రహ్మంగారితండాలో వంటమనిషి ఇంట్లో పునఃప్రారంభమైన బడి

ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలి

తొర్రూరు: ప్లాస్టిక్ నిర్మూలనకు పట్టణవాసులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. 100 రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాపార సముదాయాల్లో లభ్యమైన ప్లాస్టిక్‌ను సీజ్ చేయడంతో పాటు పలువురికి జరిమానా విధించారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోనివారికి, లైసెన్స్ తీసుకోని వారికి జరిమానా విధించారు. అనంతరం జంగిల్ కటింగ్ చేశారు. తడిపొడి చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రకృతికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ వాడొద్దన్నారు.



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

పూజారుల భవనం ప్రారంభం


పూజారుల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారంలో రూ. కోటి 98 లక్షలతో నిర్మించిన సమ్మక్క, సారలమ్మ పూజారుల సముదాయ భవనాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క గురువారం ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క.. పూజారులతో సమావేశమై జాతర నిర్వహణపై చర్చించారు. జాతరలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై పూజారులు మంత్రికి వివరించారు. అంతకుముందు మంత్రి సీతక్క తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు మంత్రి సీతక్కకు పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవీందర్, ఈఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, పూజారులు కాక సారయ్య, అరుణ్‌కుమార్, భోజరావు, కాక కిరణ్ , తదితరులు పాల్గొన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న ఎంపీఆర్‌డీ బృందం


పూజలు చేస్తున్న ఎంపీఆర్‌డీ బృందం

మంగపేట: మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి వారిని మినిస్ట్రీ ఆఫ్ పంచాయతీ(ఎంపీఆర్‌డీ) భారత ప్రభుత్వ న్యూఢిల్లీకి చెందిన రాంబాబుగుప్తా, సమీ అశ్రర్ మిశ్రా బృందం గురువారం దర్శించుకుంది. అనంతరం మండలంలోని వాడగూడెం గ్రామాన్ని సందర్శించి పెసా చట్టం అమలు తీరుపై లఘు చిత్రం చిత్రీకరించారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ ఎస్‌డీసీ డీటీ అనిల్, పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, టీజీఎండీసీ డీపీఓ మేకల కిరణ్, పెసా మొబిలైజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు, మొబిలైజర్లు పూసం కార్తీక్, మడి శోభన్‌బాబు, పాయం రమేశ్, పూనెం రఘురాం, పున్నం శ్రవణ్, యాలం శ్రీను, తాటి విజయ్‌బాబు పాల్గొన్నారు.

7 నుంచి కరీంనగర్, తిరుపతి వీక్లీ స్పెషల్ ట్రైన్

ఖిలా వరంగల్: జూలై 7వ తేదీ నుంచి కరీంనగర్–తిరుపతి వీక్లీ స్పెషల్ ట్రైన్ నడుపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8న తిరుపతి– కరీంనగర్ వీక్లి వన్స్ ట్రైన్ నడవనుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రెండు గంటలు.. 30 మంది అధికారులు

కాజీపేట జంక్షన్‌లో రైల్వే సేఫ్టీ బృందం తనిఖీలు

- ప్రత్యేక స్పీక్ రైలులో కాజీపేటకు చేరుకున్న సౌత్ వెస్ట్రన్ రైల్వే బృందం

కాజీపేట రూరల్ : సౌత్ వెస్ట్రన్ ఇంటర్ రైల్వే సేఫ్టీ ఆడిట్ అధికారుల బృందం గురువారం సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్‌కు చేరుకుంది. రైల్వే గేట్లు, వంతెనలు, సిగ్నల్ పాయింట్లు, ట్రాక్‌ను తనిఖీ చేసుకుంటూ కాజీపేటకు చేరుకున్న సౌత్ వెస్ట్రన్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన దాదాపు 30 మంది బృంద సభ్యులకు కాజీపేట రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సౌత్ వెస్ట్రన్ రైల్వే హుబ్లీ ప్రిన్సిపాల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రామకృష్ణ నేతృత్వంలో సౌత్ వెస్ట్రన్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, కాజీపేట అధికారులు రైల్వే సీఆర్ఎస్‌ఈ వి.ఎం.దాస్‌పుత్ర, సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్


రైల్వే రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ సిస్టంలో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

రవీంద్రనాథ్, సీటీపీఎఫ్ దినేశ్, సీనియర్ డీఎస్‌ఓ సురేశ్, సీఈఎల్‌ఈ, సీనియర్ డీఎస్‌టీఈ ప్రియ అగర్వాల్, డీఓఎం జనరల్ సుధీర్‌కుమార్, కాజీపేట డీజిల్ సీనియర్ డీఎంఈ వెంకటకుమార్, కాజీపేట ఈఎల్ఎస్ సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి, ఇతర అధికారులు బృందం వివిధ డిపార్ట్‌మెంట్లలో తనిఖీలు నిర్వహించారు. కాజీపేట రైల్వే స్టేషన్, 140 టన్నుల క్రేన్, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, మెడికల్ రిలీఫ్ వ్యాన్ ట్రైన్, క్యారియజ్ అండ్ వ్యాగన్ డిపో, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ డిపో, లోకోపైలెట్ కార్యాలయం, రూట్ రిలే ఇంటర్ లాకింగ్ సిస్టం, రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్, రైల్వే ఇంజనీరింగ్ డిపో, సిగ్నల్ వ్యవస్థ, పాయింట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన విషయాలపై ఆరా తీసి నోట్ చేసుకున్నారు. గతంలో పలు చోట్ల జరిగిన రైలు ప్రమాదాలను గుర్తు చేస్తూ అలా జరగకుండా సేఫ్టీ నియమాలు పాటించాలని సలహాలు, సూచనలు చేశారు. మధ్యాహ్నం 3.09 గంటలకు చేరుకున్న అధికారుల బృందం.. రెండు గంటల పాటు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి సాయంత్రం 5.20 గంటలకు కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. అధికారుల బృందం తనిఖీల్లో కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్‌తోపాటు అన్ని విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో నేను.. నా కోడలు పోటీచేస్తాం

- మహిళగా నన్ను అవమానించారు
- ఫోన్‌ట్యాపింగ్, స్త్రీనిధి, పీఆర్ అవినీతిలో జైలుకు ఖాయం
- దయాకర్‌రావుపై టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి ఫైర్


మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

హన్మకొండ చౌరస్తా: వచ్చే ఎన్నికల్లో నేను.. నా కోడలు ఎమ్మెల్యేగా పోటీ చేస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. హనుమకొండ అశోకా కన్వెన్షన్ హాల్‌లో గురువారం మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో ఆమె మాట్లాడారు. పార్టీలకతీతంగా నాటి యతిరాజారావు నుంచి మొన్నటి దయాకర్‌రావు వరకు పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యులుగా ఉంటున్నాం.. అంతకుముందు ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని జంగా రాఘవరెడ్డి తమను కోరగా.. పార్టీలతో సంబంధం లేకుండా దయాకర్‌రావుకు సపోర్ట్ చేశామన్నారు.

అవమానాలు భరించలేకే రాజకీయాల్లోకి..

దయాకర్‌రావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం సొంత ఖర్చుతో స్థలం కొనుగోలు చేసి ఇచ్చాం. స్థలం ఇచ్చే ముందు నా భర్త పేరుపెడతామని చెప్పి చేయలేదు. అప్పటి ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు శానిటేషన్ ప్యాడ్స్ పంపిణీ నిలిపివేస్తే, మా సంస్థ ఆధ్వర్యాన ఇవ్వడానికి ముందుకొచ్చాం. ఆ కార్యక్రమానికి దయాకర్‌రావు రాలేదు. కలెక్టర్, స్కూల్ ఉపాధ్యాయులను సైతం రానివ్వకుండా చేశాడు. మేము చేసే అనేక కార్యక్రమాలను అడ్డుకుంటూ నన్ను అవమానించాడు. అమెరికా వెళ్లాక ఏనాడు రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదు. దయాకర్‌రావు చేసిన అవమానాలను తట్టుకోలేకే రావాల్సి వచ్చింది. మంత్రిగా దయాకర్‌రావు నా ఫోన్‌ను సైతం ట్యాపింగ్ చేయించారు. ఫోన్ ట్యాపింగ్, స్త్రీనిధి నిధుల గోల్‌మాల్, పంచాయతీ రాజ్ నిధుల్లో అక్రమాలు ఇలా అనేక విషయాల్లో ఆయన జైలుకు పోవడం ఖాయమన్నారు.

విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం


స్పోర్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలను గురువారం టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నిరంతరం విధుల్లో ఉంటూ ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులకు క్రీడా పోటీలతో మానసిక, శారీరక విశ్రాంతి లభిస్తుందన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేసే వారందరం అన్నదమ్ములమే.. పోటీల్లో గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ వరంగల్(ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో) ఆధ్వర్యాన ఈనెల 14 వరకు జరిగే ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ఉంటాయని, కబడ్డీ 12 జట్లు, బాల్‌బ్యాడ్మింటన్ 9 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, హనుమకొండ ఎస్‌ఈ పి.మధుసూదన్‌రావు, డీఈ టెక్నికల్ ఎ.విజయేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, కోశాధికారి ఎం. సంతోష్, కౌన్సిల్ సభ్యులు యాకూబ్‌పాషా,సునీల్ కుమార్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ట్రైయినీ కలెక్టర్లు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో ట్రెయినీ కలెక్టర్లు సౌరభ్ శర్మ, సలోని చోబ్రా, హర్ష చౌదరి, కెరోలిన్ చింగ్తయాన మావి, కొయ్యాడ ప్రణయ్ కుమార్ బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెనను పరిశీలించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి కన్నెపల్లిలోని లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించింది. పంపుహౌస్ వివరాలను ఇరిగేషన్ డీఈ సత్యబాబు వివరించారు. విద్యుత్ వినియోగం, ఎత్తిపోతల వివరాలు, స్టోరేజీ, మోటార్ల సామర్థ్యం, సాగు, తాగు అవసరాల వినియోగంపై వివరించారు. అనంతరం ట్రెయినీ కలెక్టర్ల బృందం మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీని సందర్శించింది. మహదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ,


ట్రెయినీ కలెక్టర్లకు మేడిగడ్డ బ్యారేజీ గురించి వివరిస్తున్న ఇరిగేషన్ డీఈ సురేశ్

లైసన్ అధికారి అబ్బాస్, కోర్సు డైరెక్టర్ శ్రీనివాస్, డీఈ సురేశ్ తదితరులు ఉన్నారు. కాగా, ట్రెయినీ కలెక్టర్ సౌరభశర్మ శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాఘవాపురాన్ని సందర్శించిన కేంద్ర బృందం

- కేంద్ర జలశక్తి పురస్కారానికి ప్రామాణిక అంశాల పరిశీలన

పాలకుర్తి టౌన్: కేంద్ర జలశక్తి పురస్కారానికి ప్రామాణిక అంశాలను పరిశీలించేందుకు గురువారం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని రాఘవాపురం గ్రామాన్ని కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ సైంటిస్టు పి. యాదయ్య, కేంద్ర వాటర్ కమిషన్ సబ్ డివిజన్ ఇంజనీర్ డి. చైతన్య సందర్శించారు. గ్రామంలో పదేళ్లలో భూగర్భ జలాలు పెంచడానికి చేపట్టిన పనులను ఈ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా యాదయ్య, చైతన్య మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు అద్భుతంగా ఉన్నాయన్నారు. పురస్కారం అందజేయడానికి దేశంలో 30 గ్రామాలను ఎంపిక చేశామని, ఇందులో తెలంగాణలో రాఘవాపురం


ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గ్రామం ఎంపికైందన్నారు. రాఘవాపురంలో వంద శాతం ఇంకుడు గుంతలు, వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. గ్రామంలో చేపట్టిన ప్రతీ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని పరిశీలించామన్నారు. నివేదికను కేంద్ర భూగర్భ జలవనరుల శాఖకు అందజేస్తామని తెలిపారు. వారి వెంట డీఆర్‌డీఓ పీడీ వసంత, ఎంపీడీఓ ఆవుల రాములు, ఏపీఓ మంజుల, ఎంపీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు మహేందర్, కపిలవాయి వెంకటేశ్వరాచారి, యుగేంధర్, శిరీష, ప్రియాంక, మహేశ్‌యాదవ్, లింగయ్య తదితరులు ఉన్నారు.

మరిన్ని పీఎంశ్రీ స్కూళ్ల ఎంపికకు కృషి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరిన్ని పీఎంశ్రీ స్కూళ్ల ఎంపికకు తనవంతు కృషిచేస్తానని ఎంపీ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యాసంవత్సరం పాఠశాలల పునఃప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు పోటీపరీక్షల ద్వారానే నియమితులవుతారన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే సర్కారు బడులు జ్ఞానకర్మాగారాలుగా మారుతాయన్నారు.ఉపాధ్యాయులు నిత్యవిద్యార్థిగా ఉంటూ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ


మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, కృత్రిమ మేధతో తరగతి గదుల అనుసంధానం డిజిటల్ బోర్డ్స్ ఏర్పాటు చేశారని విద్యాబోధన పద్ధతుల్లో నవీనప్రక్రియలను చేపడుతోందన్నారు. ఈవిద్యాసంవత్సరంలో 135 పాఠశాలల్లో కృత్రిమ మేధ తరగతులను,16 పాఠశాలల్లో పూర్వప్రాథమిక తరగతులను కూడా ప్రారంభిస్తున్నామన్నారు. డీఈఓ డి. వాసంతి మాట్లాడుతూ బడి బాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఎంఈఓ బి. మనోజ్‌కుమార్, ఆ పాఠశాల హెచ్‌ఎం జి. ఉప్పలయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం బి. రాధ, పర్యావరణ పరిరక్షణ సమితి బాధ్యులు, రిటైర్డ్ డీఎఫ్‌ఓ కాజీపేట పురుషోత్తం, అశోక్‌బాబు, ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు తొలగించారని..

ధర్మసాగర్: గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఓ యువకుడు బుధవారం గదిలో ఉంచి తాళం వేసి నిర్బంధించిన సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం రాపాకపల్లిలో గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఇటీవల ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కందుకూరి ప్రశాంత్ అనే యువకుడి పేరు వచ్చింది. ప్రాసీడింగ్ ఇచ్చే సమయంలో అతడి పేరు లేదు. తన పేరు ఎలా తొలగిస్తారంటూ ప్రశాంత్ బుధవారం మధ్యాహ్నం గ్రామ పంచాయతీ కార్యదర్శి భోగి శ్రీనివాస్‌ను ఆఫీస్ గదిలో ఉంచి తాళం వేసి దూషించాడు. దీంతో అతను పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పగా వారు చేరుకుని ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మండలంలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని, కార్యదర్శులు కూడా అనర్హుల పేర్లనే ఫైనల్ చేశారని ప్రజలు ఆరోపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

కాళేశ్వరం: కాళేశ్వరంలోని గోదావరి నదిలో పుణ్యస్నానానికి వచ్చిన ఓ వ్యక్తి.. నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం కాశీంపల్లికి చెందిన నల్లపూరి రమేశ్ (58) కాళేశ్వరం వెళ్లి గోదావరి నదిలో పుణ్యస్నానం చేసి వస్తానని చెప్పి ఈనెల 10న ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే గురువారం ఉదయం గోదావరిలో ఓ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

సునీల్ కుటుంబానికి అండగా ఉంటా..

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు రూరల్ : అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందిన సాక్షి ములుగు ఆర్‌సీ ఇన్‌చార్జ్ భూక్య సునీల్ కుటుంబానికి అండగా ఉంటానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు గురువారం సునీల్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా సునీల్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సునీల్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడంతోపాటు కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆమె వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్, నల్లెల భరత్‌కుమార్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.


సునీల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

వ్యవసాయ సర్వీస్‌లు త్వరగా మంజూరు చేయాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లలో వ్యవసాయ సర్వీస్‌లను త్వరితగతిన మంజూరు చేయాలని ఆ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. గురువారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ లింకింగ్ లైన్లు 68 పూర్తి అయ్యాయని, ఈ నెలాఖరు వరకు మిగతా 97 పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రతీ సబ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ కాకుండా నిర్వహణ చేపట్టాలని, పిడుగుల నిరోధకం అమర్చాలని సూచించారు. పురోగతిలో



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

ఉన్న కొత్త సబ్ స్టేషన్ల పనులు వేగవంతం చేయాలన్నారు. పట్టణాల్లో అవసరమైన చోట 8 ఎంవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్ లాల్, టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ రాజుచౌహాన్, జీఎంలు ఉత్తమ్, సురేందర్, డి.ఈలు అనిల్ కుమార్, ప్రభావతి పాల్గొన్నారు.

టైరు పేలి కారు బోల్తా..

- ఇద్దరు యువకుల దుర్మరణం
- వసంతాపూర్ శివారులో ఘటన

గీసుకొండ: టైరు పేలి కారు చెట్టుకు ఢీకొని బోల్తా పడిన ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వరంగల్ జిల్లా గీసుకొండ పీఎస్ పరిధిలోని వసంతాపూర్ శివారులో గురువారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కారులో నలుగురు యువకులు వరంగల్ నుంచి కోట వెంకటాపురం వెళ్లారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో వెంకటాపురం నుంచి వసంతాపురం గ్రామ శివారుకు చేరుకోగా వెనుక ఎడమవైపు టైరు పేలడంతో కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొని పల్టీలు కొట్టి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వరంగల్


షోయబుద్దీన్, షేక్ మహ్మద్ మృతదేహాలు

ఎల్‌బీ నగర్‌కు చెందిన ఎండి. షోయబుద్దీన్(17), వరంగల్ చింతల్‌కు చెందిన షేక్ మహ్మద్(18) అక్కడికక్కడే మృతి చెందారు. ఎల్‌బీ నగర్‌కు చెందిన ఎండి. సమీర్‌పాషా, జాన్‌పాకకు చెందిన ఎండి. ఇస్మాయిల్ అలీకి తీవ్ర గాయాలు కాగా వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. గీసుకొండ ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు.

నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

చిట్యాల: నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రవన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని నైన్‌పాక, కుమ్మరిపల్లి గ్రామాల్లో నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై శ్రవన్‌కుమార్‌తో పాటు, వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోదాలు నిర్వహించారు. నైన్‌పాకకు చెందిన జంగ కుమార్, కుమ్మరిపల్లికి చెందిన బిక్కనూరు విజయ్ అనుమతి లేని ఆర్–కాట్–999 బీటీ–5, 32 ప్యాకెట్లు, ది క్యాప్టన్ పింక్ గార్డ్ –5జీ పత్తి విత్తనాలు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచుకున్నారు. దీంతో ఆ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నిషేధిత పత్తి విత్తనాల విలువ రూ.38 వేలు ఉంటుంది. ఈ ఘటనపై ఏఓ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తి విత్తనాల ప్యాకెట్లు

చిత్రకళా ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం

- గూగుల్ వికీపిడియాలో రజనీకాంత్‌కు చోటు

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో చిత్రకళా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఆడెపు రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ సోషల్ మీడియా సంస్థ గూగుల్ రజనీకాంత్ ప్రతిభను గుర్తించి వికీపిడియాలో చోటు ఇచ్చింది. అంతర్జాతీయంగా, జాతీయంగా విభిన్న రంగాల్లో రాణిస్తూ ప్రపంచంలో కొత్త ఆవిష్కరణలు చేసే వారిని గుర్తించి గూగల్ వికీపిడియాలో సమాచారం పొందుపరుస్తారు. రజనీకాంత్ సూక్ష్మకళలో అంతర్జాతీయంగా రాణిస్తూ సుమారు 100కు పైగా విభిన్న ఆకృతుల్లో సూక్ష్మ కళాఖండాలను రూపొందించారు. ఇందుకు గాను ఆర్‌హెచ్‌ఆర్ వరల్డ్ రికార్డు, రికార్డు హోల్డర్ రిపబ్లిక్ ఇండియా రికార్డు, రెండు బుక్ ఆఫ్ స్టేట్ రికార్డులు, తెలుగుబుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, సృజనపుత్ర అవార్డు, ఉత్తమ కళారత్న అవార్డు, గ్రామీణ కళాజ్యోతి అవార్డు, ఉత్తమ కళాకారుడి అవార్డులు అందుకున్నారు. రెండు బియ్యపు గింజలపై 278 అక్షరాలను, జాతీయగీతం జనగణమన, జాతీయగేయం వందేమాతరం రూపొందించారు. అంతేకాకుండా రజనీకాంత్ గుండుపిన్ను సహాయంతో పెన్సిల్ గ్రాఫైట్‌పై ప్రపంచంలో అతి సూక్ష్మ ఎత్తుకలిగిన గణపతి విగ్రహాన్ని రూపొందించడంతోపాటు చాక్‌పీస్‌లపై 78 జాతీయజెండాలను, 109 శివలింగాలను తయారు చేశారు. రజనీకాంత్ ప్రతిభను గుర్తించి పూర్తి సమాచారం సేకరించి వికీపిడియాలో పొందుపర్చినట్లు వికీపిడియా సమాచార సేకరణకర్త ఆత్రపు మోతీరామ్ తెలిపారు.


రజనీకాంత్


చాక్‌పీస్‌పై తయారు చేసిన శివలింగాలు

పెళ్లికి అడ్డుగా మారిన వరుస..

- కూతురు వరుస కావడంతో పెళ్లికి అభ్యంతరం చెప్పిన యువతి
- వేరే సంబంధాలు చూస్తుండగా మనస్తాపంతో ఏఈఈ ఆత్మహత్య

బయ్యారం: ప్రేమికురాలితో కడదాకా జీవిద్దామనుకుంటే వరుస అడ్డురావడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ ప్రేమికుడు బలవన్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కాపువారిగూడెం గ్రామానికి చెందిన పానుగోత్ దేవీలాల్(34) మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో నీటిపారుదలశాఖ ఏఈఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత అక్టోబర్‌లో మొదటి పోస్టింగ్ పొందిన దేవీలాల్.. గార్లలో విధులు నిర్వర్తిస్తూ బయ్యారంలో అద్దెకుంటున్నాడు.

పెళ్లికి యువతి నిరాకరణ..

దేవీలాల్‌కు ఉద్యోగం రాకముందు పది సంవత్సరాలుగా తన తండాకు చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో ఆ యువతి వరుసకు కూతురు అవుతుండడంతో పెళ్లికి అభ్యంతరాలొచ్చాయి. దీంతో మనస్తాపం చెంది మొదటిసారి ఆత్మహత్యాయత్నం చేసుకోగా కాలు కోల్పోయాడు. ఆ తర్వాత ప్రభుత్వం ఉద్యోగం సాధించినా ఆ యువతిని మరవలేదు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగం రావడంతో దేవీలాల్‌కు పెళ్లి చేసేందుకు కుటుంబీకులు సంబంధాలు చూస్తున్నారు. అయితే తాను ప్రేమించిన యువతితో పెళ్లి అయ్యే పరిస్థితి లేకపోవడంతో కొన్ని రోజులుగా డిప్రెషన్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో పురుగుల మందు తాగే ముందు చివరి ప్రయత్నంగా బుధవారం ప్రేమికురాలితో ఫోన్‌లో మాట్లాడాడు. అయితే వరుస కుదరని ఆ యువతి తెలపడంతో పురుగుల మందు తాగాడు. అనంతరం ఈ విషయాన్ని తమ కార్యాలయంలో పనిచేసే అటెండర్ కుమారుడికి ఫోన్‌లో తెలిపాడు. వెంటనే దేవీలాల్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి మంగ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు.


దేవీలాల్(ఫైల్)